క్లుప్తంగా

సీజనల్ వ్యాధులను అరికట్టండి



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేష్

ఇల్లెందు: ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు స్పందించి వ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ అన్నారు. కొముురారం, రొంపేడు పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలో మందులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం ఇల్లెందు మండలంలోని రొంపేడు, కొమురారం వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, దోమతెరలను పంపిణీ చేయాలని కోరారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రావూరి ఉపేందర్, కిన్నెర గోపాల్, ప్రేమ్‌కుమార్, దిలీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ



హెల్త్‌కార్డులు అందజేస్తున్న రమేష్‌కుమార్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మేడ్ సేవా ఇన్సూరెన్స్ కార్డులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ అందజేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమ నిధికి కేటాయించిన రూ.100 కోట్లపై వస్తున్న వడ్డీ నుంచి న్యాయవాదుల కుటుంబాలకు రూ.2 లక్షల విలువైన హెల్త్‌కార్డులను అందజేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో హెల్త్‌కార్డు ఇన్సూరెన్స్‌లను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దుండ్ర రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, మహిళా ప్రతినిధి ఎన్.మనోరమ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరయ్యకు ప్రశంసాపత్రం



ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న వీరయ్య

పాల్వంచ: స్వేరో అనే పదం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో చోటు సంపాదించుకుంది. ఈ మేరకు స్వేరోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకబత్తిని వీరయ్యకు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్‌లో జరిగిన విజయోత్సవ సభలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు టి.హరిబాబు, వినోద్, బూర్గుల కరుణాకర్, వెంకట రత్నం హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

పాల్వంచ: అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం పాల్వంచలో వరంగల్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రీజియన్ స్థాయి వర్క్‌షాప్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె మణి అధ్యక్షతన నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ.. 48 ఏళ్లుగా అంగన్‌వాడీ సిబ్బంది గౌరవవేతనం పేరుతో చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్‌లో మాతాశిశు సంక్షేమం కోసం నిరంతరం గ్రామాల్లో శ్రమిస్తున్నారన్నారు. పెన్షన్, గ్రాడ్యుటీ, పీఎఫ్, హెల్త్ కార్డు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పదోన్నతి లేకుండా పనిచేస్తున్న వీరిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తెలంగాణ వస్తే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండరని వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సీతామహాలక్ష్మి, వేల్పుల మల్లికార్జున్, రెడ్డి అరుణ, కృష్ణ కుమారి, సుజాత లక్ష్మి, మణి, లక్ష్మి, కోరెం శ్రీలత, నర్సమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం..

- ఆర్‌టీఏ చెక్‌పోస్టు రోడ్డు
- పట్టించుకోని అధికారులు



ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

పాల్వంచరూరల్: పారిశ్రామిక, ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని భద్రాచలం జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు, రంగాపురం క్రాస్‌రోడ్డులో తరుచు ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది లారీలు, కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు రాత్రి పగలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు, కంటైనర్లు ఇదేమార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి తోడు మణుగూరు సింగరేణి బొగ్గు రవాణా, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్న అశ్వాపురం, సారపాక ఐటీసీ కర్మాగారాలకు వెళ్లే బొగ్గు, పేపర్ ట్రాన్స్‌పోర్టు లారీలు, ఇసుక లారీలు ఈ మార్గం ద్వారా తిరుగుతుంటాయి. ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద, పెద్దమ్మతల్లి గుడి వద్ద, ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపివేయడం వలన ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ఇక్కడే ఎందుకు జరుతున్నాయంటే..

భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వచ్చే ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలు, బస్సులు చెక్‌పోస్టులో అంతరాష్ట్ర ట్రాన్స్‌పోర్టు పర్మిషన్‌కు సంబంధించిన కాగితాలను ఆర్టీఏ చెక్‌పోస్టులోని అధికారులతో పరిశీలింపజేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా లారీ డ్రైవర్లు వాహనాన్ని రోడ్డు పక్కన పెట్టి పర్మిట్ కాగితాలను చెక్‌పోస్టు అధికారులకు చూపించి వస్తారు. మరికొంత మంది రాత్రి అయితే రోడ్డు మీదనే వాహనాన్ని నిలిపి క్లినర్ లేదా డ్రైవర్ రోడ్డు దాటి చెక్‌పోస్టులకు వెళ్తున్న క్రమంలో మరో వాహనానికి రోడ్డు మీద ఉన్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా లారీ క్లీనర్లు కూడా పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. చెక్‌పోస్టుకు సమీపంలో వేబ్రిడ్జి ఉంది. ఇది భద్రాచలం నుంచి పాల్వంచ రోడ్డుకు రైట్‌సైడ్ ఉండటం వలన లారీలు తూకం వేసుకుని తిరిగి కుడి నుంచి ఎడమ రోడ్డుకు వచ్చేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఆర్‌టీఏ చెక్‌పోస్టుకు ఎదురుగా వేబ్రిడ్జి

డేంజర్ స్పాట్లను గుర్తించిన పోలీసులు..

నాగారం, దంతలబోరు, సంగం తదితర గ్రామాలకు వెళ్లాలంటే రంగాపురం వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేసి వాహనాలు రాకపోకలు సాగించడం వలన రంగాపురం వద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కేశవాపురం, బస్వతారక కాలనీ వద్ద రాజ్‌దీప్ కంపెనీ, సోములగూడెం క్రాస్‌రోడ్డు, జగన్నాథపురం శివారులో నాగారం, తోగ్గూడెం గ్రామాలకు వెళ్లే క్రాస్‌రోడ్డు, ఇందిరానగర్ పెట్రోల్ బంక్ వద్ద బంక్‌లోకి వాహనాల పెట్రోల్ కోసం వెళ్లిన సయమంలో లేదా, పెట్రోల్ పోసుకుని వస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. రంగాపురం నుంచి ఆర్టీఏ చెక్‌పోస్టు వరకు గత నెల నుంచి ఇప్పటి వరకు ఏడు రోడ్డు ప్రమాదాలు సంభవించగా ఇందులో ఇద్దరు మృతి చెందారు. ఇలా అనేక ప్రమాదాల జరుగుతుండడంతో వాహనాదారులు భయాందోళనకు గురవుతున్నారు.

వాహనదారులపై చర్యలు తీసుకోవాలి



బీసీఎం జాతీయ రహదారిపై ఎక్కడ పడితే ఎక్కడ భారీ వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా నిలిపి ఉంచడం, అతివేగంగా వాహనాలను నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన నిలిపే వాహనాలపై చర్యలు తీసుకోవాలి.

– జి.వెంకటేశ్వరరెడ్డి, నారాయణరావుపేట

రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది



బీసీఎం జాతీయ రహదారి మీద ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే భయమేస్తోంది. పెద్దమ్మ గుడి వద్ద, చెక్‌పోస్టు వద్ద, ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు రాత్రి సయమంలో నిలిపి వేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సతీష్, తోగ్గూడెం

త్వరలోనే సిగ్నళ్లు...



రంగాపురం నుంచి ఇందిరనగర్ కాలనీ పెట్రోల్ బంక్ వరకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాం. వాహనాల వేగాన్ని నియంత్రించే సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నాం.

– కార్తీక్, ఎస్ఐ, పాల్వంచరూరల్

నిర్లక్ష్యం చేస్తే పతనం తప్పదు



మాట్లాడుతున్న నరసింహారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళా ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తే సీఎం కేసీఆర్‌కు పతనం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జె.సీతాలక్ష్మి అన్నారు. క్రమబద్ధీకరణ డిమాండ్‌తో రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. వారం రోజులుగా రెండో ఏఎన్ఎంలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. రెండుసార్లు చర్చలు జరిపిన హెల్త్ డైరెక్టర్ క్రమబద్ధీకరణపై ఎలాంటి సానుకూలత వ్యక్తం చేయలేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా విడుదల చేస్తున్న ఉద్యోగ ప్రకటనలో రెండో ఏఎన్ఎంలకు వెయిటేజీ తగ్గిస్తూ అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగ ప్రకటనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరాటి ప్రసాద్, వి.మల్లికార్జున్, పద్మ, లక్ష్మి, మణి, ఎండీ సజ్జుబేగం, బానోత్ ప్రియాంక, కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప, బాలనాగమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుంది



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, ఎస్ఐ రాము

పాల్వంచ: రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మనిస్తుందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, ఎస్ఐ బి.రాము అన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం న్యూ మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఖాసీం ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. డాక్టర్ సోమరాజు దొర, డాక్టర్ సింధు, క్రీడాకారిణి సింధు తపస్వీ, సతీశ్, చింతా నాగరాజు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కుక్కునూరు మండలం వెంకటాపురానికి చెందిన నిరోష అనే మహిళకు రక్తం అత్యవసరం కావడంతో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా మంగళవారం రక్తదానం చేసి ఆదుకున్నాడు.

గంబూషియా చేపలు విడుదల



నిల్వనీటిలో చేపలను వదులుతున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల ఆదేశం మేరకు సులానగర్ పీహెచ్‌సీ సిబ్బంది టేకులపల్లి మండలంలో గుర్తించిన నీటి నిల్వల్లో ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గంబూషియా చేపలను వదిలారు. మాట్లాడుతూ.. పర్యావరణానికి ఎటువంటి హాని జరగకుండా, రసాయనాలు వాడకుండా దోమల లార్వాలను చంపడానికి కీటక జనిత వ్యాధుల నివారణలో ప్రపంచవ్యాప్తంగా ఈ గంబూషియా చేపలను వాడటం జరుగుతుందన్నారు. 4 నుంచి 6 సెంటీమీటర్ల వరకు మాత్రమే పెరిగే ఈ అతిచిన్న చేప అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుందని దీని జీవితకాలం కనీసం నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు అని పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖ భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువులో ఈ చేపల పెంపకాన్ని చేపట్టినట్లు తెలిపారు. నివాస సముదాయాల్లో తొలగించలేని నీటి నిల్వల్లో ఈ గంబూషియా చేపలను వదలడం వల్ల దోమల నివారణను విజయవంతంగా అరికట్టవచ్చన్నారు. సర్పంచ్ పూనెం ఉమ, సూపర్‌వైజర్లు నాగుబండి వెంకటేశ్వర్లు, పోరండ్ల శ్రీనివాస్, ధనసరి రాంబాబు, కమల రమాకుమారి, పరంగిణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండె బాధితులకు వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ రవికాంత్

కొత్తగూడెంఅర్బన్: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి స్థానికంగా చికిత్స అందజేయనున్నట్లు డాక్టర్ అత్తులూరి రవికాంత్ తెలిపారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానికుడైన తన తండ్రి వెంకటేశ్వరరావు జిల్లా వాసులకు వైద్య సేవలు అందించారని చెప్పారు. తాను కూడా స్థానికులకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ యశోదా ఆస్పత్రిలో పనిచేస్తూనే వారానికి రెండు రోజులు కొత్తగూడెం వస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉచితంగా, మిగతా వారికి తక్కువ ఫీజుతో పరీక్షలు, శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వాసులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని రవికాంత్ కోరారు.

ముస్లింలకు అన్యాయం

కొత్తగూడెంఅర్బన్: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించలేదని జిల్లా మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 115 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్.. ముస్లింలకు కేవలం 3 సీట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఎంఐఎంతో దోస్తీ కొనసాగిస్తున్నామని ప్రకటించి అదే నియోజకవర్గాల్లో పోటీ ఎలా చేస్తారని విమర్శించారు.

స్కౌట్స్ ఆధ్వర్యంలో 'మేరీ మిట్టీ – మేరా దేశ్'



పాల్గొన్న సింగరేణి అధికారులు, స్కౌట్ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): భారత్ స్కౌట్స్ గైడ్స్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో మంగళవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా మేరీ మిట్టీ – మేరా దేశ్ కార్యక్రమం కొత్తగూడెం బస్టాండ్ సమీపంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం పర్సనల్ (వెల్ఫేర్), సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ కమిషనర్ కే.శ్రీనివాస్‌రావు హాజరై మేరీ మిట్టీ– మేరా దేశ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అందరి నుంచి మట్టిని సేకరించారు. ఏజీఎం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన అమరవీరులైన ధైర్యవంతులైన సైనికులు, పోలీసులను, దేశభక్తులు గౌరవించేందుకు మేరీ మాటీ – మేరా దేశ్ నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ, గ్రామీణ, పట్టణ ప్రాంతాలో మట్టిని సేకరించి ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్మించే అమృత వాటిక ఉద్యానవనానికి, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ స్మారకచిహ్నం నిర్మాణంలో ఉపయోగించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీవైపీఎంలు కే.శివకుమార్, జీకే కిరణ్‌కుమార్, వెల్ఫేర్ పీఓ వరప్రసాద్, సూపర్‌వైజర్లు ఎంసీ పాసినెట్, సేవా కోఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, వివిధ పాఠశాలల విద్యార్థులు, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

జూలూరుపాడు: బీఆర్ఎస్ పార్టీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులోని మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో నాయకులు, మదన్‌లాల్ అనుచరులు సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. మదన్‌లాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు.

హరిప్రియకు పార్టీ శ్రేణుల స్వాగతం



ఎమ్మెల్యే హరిప్రియకు స్వాగతం పలుకుతున్న పార్టీ కార్యకర్తలు

ఇల్లెందు: బీఆర్ఎస్ టికెట్ పొందిన తర్వాత హైదరాబాద్ నుంచి ఇల్లెందుకు వచ్చిన సందర్భంగా మంగళవారం ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రచార రథం మీదుగా ప్రజలకు అభివాదం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్, కొమరంభీం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెను క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. హరిప్రియ మాట్లాడుతూ.. టికెట్ ప్రకటనకు మూడు రోజులు ఉత్కంఠంగా సాగినప్పటికీ సీఎం కేసీఆర్ తనను ఆశీర్వదించారని తెలిపారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, నాగరత్నమ్మ, ఉమ, ఎస్.రంగనాథ్, సయ్యద్ జానీపాషా, కొక్కు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, శీలం రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కూతురికి సీఎం ఆశీర్వాదం

ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ కుమార్తె రుద్రభారతీప్రియను సీఎం కేసీఆర్ ఆశీర్వదించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ అభ్యర్థుల ప్రకటన అనంతరం ప్రగతి భవన్‌కు వెళ్లే క్రమంలో హరిప్రియ సీఎంను కలిశారు. ఈ క్రమంలో కేసీఆర్ ఎమ్మెల్యే కూతురిని బాగా చదువుకోవాలని, పెద్ద రాజకీయ నాయకురాలు కావాలని ఆశీర్వదించారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న రుక్మాంగధర్ బండారి

కొత్తగూడెంఅర్బన్: ఆర్థికంగా మహిళలను బలోపేతం చేయడమే శ్రీనిధి లక్ష్యమని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి తెలిపారు. మంగళవారం వార్డులో రాజీవ్ పేద ప్రాంత సమైక్య సర్వసభ్య సమావేశం జరిగింది. బండారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల సమగ్రాభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులందరికీ ఆదాయం పెంపొందించడం, అన్ని రకాల అవసరాలకు సత్వర రుణం పొందేందుకు సత్వర సహకారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఆత్మగౌరవం పెంపొందించడానికి శ్రీనిధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాగయ్య, మౌలాలి, ఆర్పి రాజ్యలక్ష్మి, మునిగ సుజాత, కోశాధికారి తమ్మిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి జనపరెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజా చైతన్య సభ



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: కొత్తగూడెంలో బుధవారం జరగనున్న ప్రజా చైతన్య సభను విజయవంతం చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ పిలుపునిచ్చారు. పాల్వంచలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సులో కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆసిఫ్‌ఖాన్, నేషనల్ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి పాల్గొననున్నందున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కొత్తగూడెం నుంచి గతంలో కాంగ్రెస్ తరపున వనమా వెంకటేశ్వరరావు ఇవే చివరి ఎన్నికలు అన్నారని చెప్పారు. కానీ మళ్లీ ఆయనే బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగుతున్నారన్నారు. కాగా, కాంగ్రెస్ కొత్తగూడెం సీటు తనకే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఎవరికి ఇచ్చినా తాను కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, బద్ది కిశోర్, జలీల్, రమేశ్, చాంద్ పాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డాక్టర్ సుకృత

ఇల్లెందురూరల్: ప్రతి మంగళవారం మహిళలకు అందిస్తున్న సేవలపై విస్తృతంగా ప్రచారం చేసి మహిళలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుకృత, పీఓ ఎంసీహెచ్ డాక్టర్ చైతన్య, డీపీహెచ్ఎన్ఓ అన్నామేరీ సూచించారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీని మంగళవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మహిళా వైద్యశిబిరాన్ని పరిశీలించారు. పలువురు మహిళలతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మంగళవారం ఆస్పత్రిలో అందుతున్న సేవలను మహిళలు గ్రామాల్లో వివరించి మరింత మంది సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. రోజువారీ ఓపీ, ఇన్‌పేషంట్స్, మందుల నిల్వ వంటి అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యసేవల మెరుగు కోసం ఆస్పత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత మహిళకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్


కొత్తగూడెంటౌన్: హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో గిరిజన మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో తీవ్రంగా గాయపడిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించి మహిళకు న్యాయం చేయాలని గిరిజన జేఏసీ నాయకులు డాక్టర్ శంకర్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన మహిళపై దాడి జరిగితే ఇప్పటివరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం సరికాదన్నారు. ఇకనైనా ఉద్యోగులను సస్పెండ్ చేసి మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజ్మీరా శంకర్‌నాయక్, లావుడ్యా ప్రసాద్‌నాయక్, యోగినాయక్, రమేష్‌నాయక్, మంగీలాల్ నాయక్, మోహన్‌నాయక్, రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం వాసులకు గృహలక్ష్మి నిబంధనలు సడలించాలని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ డిమాండ్ చేశారు. రామవరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ పట్టా కావాలని అడుగుతుండడంతో అర్హులు నష్టపోయే అవకాశముందన్నారు. ఇకనైనా ఉమ్మడి ఏపీలో ఇందిరమ్మ పథకాన్ని అమలు చేసినట్లుగానే గృహలక్ష్మి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంగమ్మ, మార్తమ్మ, జానకి, కవిత, డి.సీత, అను, సుప్రియ, బేబి, రాజేశ్వరి, మహేశ్వరి, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై గుంతలు పూడ్చరూ..!



పాల్వంచ మండలం పాండురంగాపురం ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. కేటీపీఎస్ 5వ దశ ప్రధాన గేటు నుంచి రెండో గేటు వరకు పాండురంగాపురం, సూరారం గ్రామాలకు వెళ్లే రహదారిపై బూడిద లారీలు, కంటైనర్లు రాకపోకలు సాగించడంతో రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. రహదారిని బాగుచేయాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు గుంతల్లో నీరు నిలిచి ఏ గుంత ఎంత లోతు ఉందో అర్థంకాక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ సీఈ
సెల్‌నెంబర్: 9490610705